

సల సల!

రోహిణి కార్తె వెళ్లిపోయినా భానుడు శాంతించడం లేదు. ఉమ్మడి విశాఖ జిల్లాలో ఎండ తీవ్రతకు జనం అల్లాడిపోయారు. 8లో



సమస్యల పరిష్కారానికి వినతి

సమస్యలు పరిష్కరించాలని గ్రామ సచివాలయం వెటర్నరీ అసిస్టెంట్లు ఎస్టీ కమిషన్ చైర్మన్ కుంభా రవిబాబును కోరారు. 8లో



వంద కిలోల గంజాయి పట్టివేత

ఆంధ్ర, ఒడిశా సరిహద్దు నుంచి మహారాష్ట్రకు తరలిస్తున్న వంద కిలోల గంజాయిని మారేడుమిల్లి పోలీసులు పట్టుకున్నారు. 8లో

గోదారమ్మ కరుణించేనా?

జిల్లాలో విలీన మండలాల రైతులు కోటి ఆశలతో ఖరీఫ్ సాగుకు సిద్ధమవుతున్నారు. ఏటా వరుస విపత్తులతో కష్టాలు ఎదురవుతున్నా ప్రభుత్వం అందించే ఆర్థిక భరోసాతో సాగుకు సమాయత్తమవుతున్నారు. ఈ ఏడాదైనా గోదారమ్మ ముంచెత్తకుండా కరుణిస్తుందన్న ఆశతో వ్యవసాయ పనుల్లో నిమగ్నమయ్యారు. తొలకరి పలకరింపు కోసం ఎదురు చూస్తున్నారు.

- కోటి ఆశలతో సాగుకు సిద్ధమవుతున్న విలీన మండలాల రైతులు
- ప్రభుత్వం అందించే ఆర్థిక భరోసాతో సమాయత్తం
- తొలకరి పలకరింపుకోసం ఎదురుచూపు



సాగుకు సిద్ధమవుతున్న భూమి

ఎటపాక: జిల్లాలోని విలీన మండలాలైన ఎటపాక, వీఆర్‌పురం, చింతూరు, కూనవరం మండలాల్లో వ్యవసాయం పరిస్థితి భిన్నంగా ఉంటుంది. ఈ ప్రాంతంలో పూర్తిగా ప్రకృతిపైనే ఆధారపడి ఉంటుంది. ఏమాత్రం గోదావరి ఉప్పొంగినా పంటలపై ఆశలు వదులుకోవాల్సిందే.

30 వేల ఎకరాల్లో..

చింతూరు డివిజన్ పరిధిలోని నాలుగు మండలాల్లో సుమారు 30వేల ఎకరాల్లో 11వేల మంది రైతులు వివిధ రకాల పంటలు సాగు చేస్తున్నారు. పోలవరం ముంపు పరిహారం పొందిన భూముల్లో సహా పది వేల ఎకరాల్లో మిరపను పండిస్తున్నారు. వేసవి దుక్కులు చేసుకుంటూ రైతులు పొలాల్లో బిజీగా ఉన్నారు. రైతు భరోసా కేంద్రాల ద్వారా విత్తనాల పంపిణీకి వ్యవసాయశాఖ అధికారులు చర్యలు చేపట్టారు. ఇప్పటికే రైతులకు అవసరమైన వరి విత్తనాల వివరాలను ప్రభుత్వానికి నివేదించారు.

మిరప విత్తనాలకు డిమాండ్

వాణిజ్య పంట మిరప విత్తనాలకు ఈ ఏడాది మంచి డిమాండ్ ఉంది. ఇప్పటికే వివిధ కంపెనీలు విత్తనాల ధరలను అమాంతం పెంచేశాయి. ఈ ప్రాంత ఎక్కువగా మిరప హైబ్రిడ్ రకాలు 341, 2222, అనాల, సన్‌గ్రో, మైకో అశ్విని తదితర విత్తనాలను ఎక్కువగా వినియోగిస్తుంటారు. రైతులు తెలంగాణ ప్రాంతంలో వ్యాపారుల వద్ద కొనుగోలు చేసి ముందుగానే సిద్ధం చేసుకున్నారు.

గత రెండేళ్ల నుంచి మిర్చి తోటలపై నల్లి ప్రభావం ఎక్కువగా ఉన్నందున విత్తన తయారీని వివిధ కంపెనీలు అనుకున్న స్థాయిలో ఉత్పత్తి చేయలేదు. ఈకారణంగానే విత్తన కొరత ఏర్పడింది. మరోపక్క దిగుబడులు తగ్గడం, గోదావరి వరద ముంచెత్తడం కారణంగా నష్టాలు చవిచూశారు. ఈ ఏడాదైన వాతావరణం సహకరిస్తాదన్న ఆశతో ఉన్నారు.

ధర భారీగా పెంచేసిన వ్యాపారులు

గత ఏడాది 341 రకం కిలో మిర్చి విత్తనాలు రూ.40 వేల వరకు ఉంటే అవే విత్తనాలు ప్రస్తుతం రూ.లక్ష వరకు పలుకుతోంది. రైతుల అవసరాన్ని ఆసరాగా చేసుకున్న కొందరు వ్యాపారులు ధరలు పెంచేశారు. డిమాండ్‌ను దృష్టిలో పెట్టుకుని నకిలీ విత్తనాలు విక్రయాలు చేసే అవకాశం ఉందని పలువురు పేర్కొన్నారు. మిర్చి పంటకు మంచి ధర ఉన్నప్పటికీ తెగుళ్ల ప్రభావంతో దిగుబడులు తగ్గడంతోనే ఈ ఏడాది విత్తనాలకు డిమాండ్ పెరిగింది.

భారీగా పెరిగిన కౌలు

గోదావరి పరివాహక భూముల్లో కౌలు ధర ఎకరాకు రూ.25 వేల నుంచి 50 వేల వరకు ఉంది. ఎకరాకు రూ.1.6 లక్షల వరకు పెట్టుబడి అవుతోంది. గతంలో ఎకరాకు దిగుబడి రూ.20 క్వింటాళ్లు వచ్చేది. నల్లి తామర పురుగు వల్ల పది క్వింటాళ్ల లోపే దిగుబడి వస్తోంది. మిర్చిలో లావు, సన్న రకాలను బట్టి ధర ఉంటుంది. సన్న రకాలు క్వింటాకు రూ.20 వేలు, లావు రకాలు రూ.20 వేల నుంచి రూ.26 వేల వరకు ఉంటుంది. విత్తన తయారీలో జన్యు పరమైన లోపాల వల్ల నల్ల తామర పురుగు రావడానికి కారణంగా రైతులు భావిస్తున్నారు.

ఖరీఫ్, రబీ సాగు వివరాలు

మండలం	వరి	పత్తి	అపరాలు	మిర్చి
చింతూరు	10,029	400	3,120	115
ఎటపాక	2,682	3,698	614	2,800
కూనవరం	1,486	1,474	1,526	977
వీఆర్ పురం	2,727	572	-	700

మిర్చిపైనే ఆశలు



గత రెండేళ్ల నుంచి మిర్చి దిగుబడులు ఆశాజనకంగా లేవు. పెట్టుబడులు దక్కక అప్పుల ఊబిలో కూరుకుపోయాం. ఈ ఏడాదైనా కాలం కలిసి వచ్చి నల్లి ప్రభావం లేకుండా ఉంటే నష్టాల నష్టాల నుంచి గట్టెక్కుతామనే ఆశతో ఉన్నాం.

– మొగిలి వెంకన్న, రైతు, గొరిదేవిపేట

వరి విత్తనాల పంపిణీకి ఏర్పాట్లు



రైతు భరోసా కేంద్రాలు రైతులకు ఎంతో ఉపయోగకరంగా ఉన్నాయి. సాగులో సలహాలు, సూచనలతో పాటు విత్తనాలు, ఎరువులు కూడా అందిస్తున్నాం. వచ్చే వారం నుంచి వరి వంగడాలను రైతులకు ఇచ్చేందుకు ఏర్పాట్లు చేస్తున్నాం.

– వై.రాబిన్ సుదర్శన్, ఏవో, ఎటపాక

న్యూస్‌రీల్

నేడు గిరిజన భవన్‌కు శంకుస్థాపన

కొయ్యూరు: మండలంలోని రాజేంద్రపాలెంలో నిర్మించనున్న గిరిజన భవన్‌కు అరకు ఎంపీ గొడ్డేటి మాధవి, పాడేరు ఎమ్మెల్యే భాగ్యలక్ష్మి శనివారం శంకుస్థాపన చేస్తారని ఎంపీపీ బడుగు రమేష్, జెడ్పీటీసీ వారా నూకరాజు, పార్టీ మండల అధ్యక్షుడు జల్లి బాబులు తెలిపారు. పార్టీ కార్యకర్తలు, ప్రజాప్రతినిధులు, సర్పంచ్‌లు, ఎంపీటీసీలు హాజరు కావాలని వారు కోరారు.

సకాలంలో భూ రీసర్వే

- ఐటీడీఏ పీవో అభిషేక్ ఆదేశం



మాట్లాడుతున్న ఐటీడీఏ పీవో అభిషేక్

పాడేరు రూరల్ : భూ రీసర్వేను సకాలంలో పూర్తి చేయాలని ఐటీడీఏ ప్రాజెక్టు అధికారి వి.అభిషేక్ ఆదేశించారు. శుక్రవారం స్థానిక ఐటీడీఏ సమావేశ మందిరంలో రీ సర్వేపై సమీక్ష నిర్వహించారు. రీసర్వే ప్రగతి పెంపొందాలని, రోవర్స్ సక్రమంగా పనిచేసేలా ఉపయోగించాలని ఆదేశించారు. నిర్దేశించిన ఆరు వేల ఎకరాల్లో సర్వేను సకాలంలో పూర్తి చేయాలని సర్వేయర్లు, గ్రామ సర్వేయర్లను ఆదేశించారు. డిప్యూటీ ఇన్‌స్పెక్టర్లు దిగువ స్థాయి సిబ్బందికి తగిన సలహాలు, సూచనలు అందించి సర్వేను వేగవంతం చేయాలని ఆదేశించారు. ఈవిషయంలో నిర్లక్ష్యం చేస్తే చర్యలు తప్పవని ఆదేశించారు. ఈ సమావేశంలో అసిస్టెంట్ కలెక్టర్ అశుతోష్ శ్రీ వాత్సవ, సర్వే అండ్ ల్యాండ్ రికార్డ్స్ ఏడీ వై. మోహన్‌రావు, ఇన్‌స్పెక్టర్ ఎస్. నాగేశ్వరరావు, డిప్యూటీ ఇన్‌స్పెక్టర్లు జి. వెంకటరావు, కె. కృష్ణమోహన్, కె. లక్ష్మణ్‌రావు పాల్గొన్నారు.

ఆర్బీకేల్లో పసుపు కొనుగోళ్లు

చింతపల్లి: రైతుభరోసా కేంద్రాల ద్వారా కేంద్రాల ద్వారా పసుపు కొనుగోళ్లకు చర్యలు చేపట్టామని మండల వ్యవసాయాధికారి శ్రీనివాసరావు తెలిపారు.శుక్రవారం ఆయన విలేకరులతో మాట్లాడుతూ క్వింటా పసుపు రూ.6850 కొనుగోళ్లు చేస్తున్నామని చెప్పారు. రైతులు సంబంధిత రైతు భరోసా కేంద్రాల్లో తమ పేర్లను నమోదు చేసుకోవాలని సూచించారు. పసుపు విక్రయించే రైతులకు సంబంధించి పంట వివరాలు ఈక్రాప్‌లో నమోదై ఉండాలన్నారు. ఆధార్ తీసుకువెళ్లి పేరు రిజిస్టర్ చేసుకోవాలని సూచించారు. ఆధార్ రైతుకు సంబంధించిన ఖాతాకు అనుసంధానమై ఉండాలని సూచించారు. ఒకొక్క రైతు నుంచి 30 క్వింటాళ్ల వరకు పసుప కొనుగోలుకు ప్రభుత్వం నిర్ణయించిందని తెలిపారు. రైతులు ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలని ఆయన సూచించారు.

108లో సుఖ ప్రసవం



శిశువును ఆశా కార్యకర్తకు అందిస్తున్న 108 సిబ్బంది

మారేడుమిల్లి : ఆస్పత్రికి 108 వాహనంలో తరలిస్తుండగా ఓ గర్భిణి మగబిడ్డకు జన్మనిచ్చింది. మండలంలోని సున్నంపాడు శివారు నూరుపూడికి చెందిన గర్భిణి కె. శివానికి పురిటి నొప్పులు రావడంతో బంధువులు 108 అంబులెన్స్‌కు సమాచారం ఇచ్చారు. వెంటనే ఆమెను రంపచోడవరం ఏరియా ఆస్పత్రికి తరలిస్తుండగా మార్గం మధ్యలో నొప్పులు ఎక్కువయ్యాయి. వెంటనే ఆమెకు 108 ఈఎంటీ ఎం.వెంకట్, పైలెట్ పీవీబీ రెడ్డి పురుడు పోశారు. ఆమె మగబిడ్డకు జన్మనిచ్చిందని, తల్లీబిడ్డ క్షేమంగా ఉన్నారని, వారి ఇరువురిని సమీపంలోని పెద్ద గెద్దాడ పీహెచ్‌సీ తరలించామని సిబ్బంది పేర్కొన్నారు.

గిరిజన సంఘం రాష్ట్ర నూతన కార్యవర్గం ఏర్పాటు



రామారావు, సురేంద్ర

అరకులోయ రూరల్: గిరిజన సంఘం జాతీయ చైర్మన్, మాజీ ఎంపీ మిడియం బాబూరావు అధ్యక్షతన శుక్రవారం శుక్రవారం గిరిజన సంఘం రాష్ట్ర కార్యవర్గ ఎన్నిక ఏకగ్రీవంగా జరిగింది రాష్ట్ర అధ్యక్షుడిగా లోతా రామారావు, ప్రధాన కార్యదర్శిగా కిల్లో సురేంద్ర, రాష్ట్ర ఉపాధ్యక్షులుగా తిరుపతిరావు, అప్పల నర్సయ్య, కిరణ్, రామకృష్ణ, సహాయ కార్యదర్శులుగా అశోక్, సంతోష్, ధర్మల రమేష్, చిన్నంనాయుడు, బాలదేవ్‌తో ఆపటు 37 మంది రాష్ట్ర కమిటీ సభ్యులుగా ఎన్నికయ్యారు.

రాజన్న ఆశయాలు జగన్‌తోనే సాధ్యం

- అరకు ఎమ్మెల్యే చెట్టి పాల్గుణ
- రాయిమామిడిలో వైఎస్ విగ్రహావిష్కరణ



వైఎస్ విగ్రహాన్ని ఆవిష్కరిస్తున్న ఎమ్మెల్యే పాల్గుణ

పెదబయలు: దివంగత సీఎం వైఎస్ రాజశేఖరరెడ్డి ఆశయ సాధన ఆయన తనయుడు సీఎం జగన్‌మోహన్ రెడ్డితోనే సాధ్యమని అరకు ఎమ్మెల్యే చెట్టి పాల్గుణ అన్నారు. శుక్రవారం మండలంలోని మారుమూల గోమంగి గ్రామ పంచాయతీ రాయిమామిడి కూడలిలో సొంత నిధులతో ప్రజలు ఏర్పాటుచేసిన వైఎస్ విగ్రహాన్ని ఆయన ఆవిష్కరించారు. పంచాయతీ ప్రజలు సొంత నిధులతో విగ్రహాన్ని ఏర్పాటు చేశారు. ఈ సందర్భంగా జరిగిన సభలో ఆయన మాట్లాడుతూ రాజన్న ఆశయాలకు తగ్గట్టుగానే ప్రజలకు సంక్షేమ పథకాలు అందుతున్నాయన్నారు. రైతుల పక్షపాతిగా వైఎస్ ప్రజల గుండెల్లో స్థానం సంపాదించగా సీఎం జగన్‌మోహన్‌రెడ్డి గ్రామ స్వరాజ్యం దిశగా పాలన సాగిస్తూ సంక్షేమాన్ని ప్రజల ముంగిటకు తెచ్చారన్నారు. మారుమూల పంచాయతీలకు కేంద్రంగా ఉన్న గోమంగిని పూర్తిస్థాయిలో అభివృద్ధి చేస్తామన్నారు. ఈ సందర్భంగా ప్రజలు జోహార్ వైఎస్సార్ అంటూ నినాదాలు చేశారు. గోమంగి పంచాయతీలోని రాయిమామిడి,గోమంగి జంక్షన్లలో రెండు షెల్టర్ల నిర్మాణానికి హామీ ఇచ్చారు. రాయిమామిడి, బోయరాజులతోట గ్రామాలకు సీసీ రోడ్లు నిర్మిస్తామని ఎమ్మెల్యే హామీ ఇచ్చారు. జేజేఎం నిధులతో తాగునీటి సౌకర్యం కల్పిస్తామన్నారు. జేజేఎం నిధులతో తాగునీరు అందిస్తామని పేర్కొన్నారు.జెడ్పీటీసీ కూడ బొంజుబాబు, మాజీ ఎంపీపీ సల్లంగి ఉమామహేశ్వరరావు, సర్పంచ్ కొర్రా జెట్టో, ఎంపిటిసి భర్త టీడీపీ నాయకుడు పురసకారి భాస్కరరావు, మాజీ జెడ్పీటీసీ సూర్యనారాయణ, మాజీ సర్పంచ్ పాంగి సింహాచలం, వైస్ సర్పంచ్ మత్స్యకొండబాబు పాల్గొన్నారు.

పీవీటీజీలకు అరుదైన అవకాశం

భారత రాష్ట్రపతి ద్రౌపది ముర్మును కలిసే అవకాశం జిల్లాలోని ఆదివాసీ గిరిజనులకు దక్కింది. పాడేరు ఐటీడీఏ నుంచి ఏడు తెగలకు చెందిన 120 మంది, రంపచోడవరం, చింతూరు ఐటీడీఏ నుంచి ఒక తెగకు చెందిన 18 మంది ఢిల్లీ బయలుదేరి వెళ్లారు. వీరంతా ఈనెల 12వ తేదీన రాష్ట్రపతి భవన్‌లో భేటీ కానున్నారు. – సాక్షి, నెట్‌వర్క్



రాష్ట్రపతిని కలిసేందుకు ట్రైన్‌లో బయలుదేరిన రంపచోడవరం ప్రాంత గిరిజనులు

కొండరెడ్ల సమస్యను వివరిస్తా



తమ తెగకు చెందిన రాష్ట్రపతి హోదాలో ఉన్న ఆదివాసీ బిడ్డను కలిసేందుకు వెళ్తుండటం ఎంతో సంతోషం, గర్వంగా ఉంది. మా కొండరెడ్డి తెగకు సంబంధించిన సంస్కృతి, సంప్రదాయాలు, ఆచార వ్యవహారాలు, జీవన విధానాన్ని రాష్ట్రపతికి వివరిస్తా. సమస్యలను ఆమె దృష్టికి తీసుకువెళ్తా. ఈ అవకాశం కల్పించిన ప్రభుత్వం, ఐటీడీఏ అధికారులకు ధన్యవాదాలు తెలియజేస్తున్నా.

– వేట్ల ముత్యాలరెడ్డి, కొల్లూరు, వీఆర్‌పురం మండలం

న్యాయం చేస్తారని భావిస్తున్నా



భారత రాష్ట్రపతి స్థానంలో గిరిజన మహిళతో ఆదివాసీల భేటీ చరిత్రలో నిలుస్తుంది. ఆదివాసీలమంతా ఇంకా అభివృద్ధి చెందాల్సిన అవసరం ఉంది. ఇందుకు కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాల సహకారం చాలా అవసరం. రాష్ట్రపతి ఆదివాసీ మహిళ కావడంతో తమ సమస్యలు అర్థం చేసుకుని న్యాయం చేస్తారని భావిస్తున్నా. ఆమెకు తమ పరిస్థితిని వివరిస్తా.

– వంతాల భీమేశ్వరరావు, డల్లాపల్లి, పాడేరు మండలం

సంతోషించదగ్గ విషయం



దేశంలోని ఆదివాసీలందరితో రాష్ట్రపతి సమావేశమవ్వడం ఎంతో సంతోషించదగ్గ విషయం. ఆదివాసీల సంక్షేమానికి కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు పనిచేస్తున్నప్పటికీ ఇంకా అనేక సమస్యలతో సతమతమవుతున్నాం. వీటిని రాష్ట్రపతి దృష్టికి తీసుకువెళ్తా. అన్ని రంగాల్లో అభివృద్ధి చేయాలని కోరుతా.

– స్వభీ రామ్మూర్తి, పక్కనాకుడి, అరకులోయ మండలం

తమ భాషలో వివరిస్తా



రాష్ట్రపతిని కలిసేందుకు అవకాశం రావడంతో ఎంతో గర్వపడుతున్నా. ఆమెను కలిసేందుకు పాడేరు ఐటీడీఏ పీవో అన్ని సౌకర్యాలు కల్పించి ఢిల్లీ పంపిస్తున్నారు. రాష్ట్ర ప్రభుత్వం అటవీభూములకు పట్టాలివ్వడంతోపాటు రైతు భరోసా అమలు చేయడంతో ఎంతో ప్రయోజనం చేకూరింది. ఈ విషయాన్ని తమ భాషలో రాష్ట్రపతికి వివరిస్తా.

– పాంగి సలీమే, పుల్లలమామిడి, జి.మాడుగుల మండలం

ఆతృతగా ఉంది



ఏజెన్సీ ప్రాంతం నుంచి ఢిల్లీ వెళ్లి రాష్ట్రపతిని కలిసే కొండరెడ్డి గిరిజనులకు ఎప్పుడు కలగలేదు. రాష్ట్రపతి ఆహ్వానంతో ఢిల్లీ వెళ్లడం ఎంతో సంతోషంగా ఉంది. ఆదివాసీ బిడ్డ రాష్ట్రపతి అయినప్పుడు టీవీల్లో చూశాం. ఎప్పుడు కలుస్తామానే అతృతగా ఉంది. ఆమెతో మాట్లాడే అవకాశం వస్తుందని ఆశిస్తున్నా.

– పల్లాల రత్నరెడ్డి, పుల్లంగి, మారేడుమిల్లి మండలం

రోడ్ల సమస్య తీసుకువెళ్తా



ఏజెన్సీలో అటవీ అభ్యంతరాలతో అనేక రోడ్ల నిర్మాణాలు మధ్యలోనే నిలిచిపోయాయి. అటవీ అభ్యంతరాలు తొలగింపుతోనే రోడ్ల నిర్మాణాలు పూర్తయి అభివృద్ధి జరుగుతుంది. వెనుకబడిన ప్రాంతం నుంచి వచ్చిన గిరిజన బిడ్డ రాష్ట్రపతి అయ్యారు. మా సమస్యలు తెలుసుకుంటారని భావిస్తున్నా.

– పల్లాల భూపతిరెడ్డి, కుట్రవాడ, మారేడుమిల్లి మండలం

102 మంది గర్భిణులకు ప్రత్యేక వైద్య పరీక్షలు

వై.రామవరం: స్థానిక కమ్యూనిటీ హెల్త్ సెంటర్‌లో శుక్రవారం 102 మంది గర్భిణులకు ప్రత్యేక వైద్య పరీక్షలు నిర్వహించారు. ఆస్పత్రి సూపరింటెండెంట్ డాక్టర్ ఎం. గౌతమి ఆధ్వర్యంలో గర్భిణులకు స్కానింగ్‌లు, రక్తపరీక్షలు నిర్వహించి మందులు పంపిణీ చేశారు. వీరిలో 38 మంది హైరిస్క్ గర్భిణుల గుర్తించారు. వీరిని ఆస్పత్రిలో అడ్మిట్ చేశారు. ప్రత్యేక వైద్యసేవలతోపాటు, అవసరమైన మందులు అందించారు. గర్భిణులందరికీ భోజన వసతి, రవాణా సౌకర్యాలు కల్పించారు. ఈ కార్యక్రమంలో గైనికాలిజిస్ట్ రాకేష్, సీహెచ్‌సీ వైద్యాధికారులు రాహుల్, చైతన్య, వైద్య సిబ్బంది పాల్గొన్నారు. మండలంలోని చవిటిదిబ్బలు పీహెచ్‌సీలో కూడా వైద్యాధికారుల నరేంద్ర, దినేష్‌ల ఆధ్వర్యంలో గర్భిణులకు స్కానింగులు, ప్రత్యేక వైద్యపరీక్షలు నిర్వహించారు.



వై.రామవరం సీహెచ్‌సీలో గర్భిణులకు స్కానింగు చేస్తున్న వైద్యాధికారులు

వలంటీర్ల సేవలు అభినందనీయం

- రంపచోడవరం ఎమ్మెల్యే ధనలక్ష్మి
- చింతూరులో వలంటీర్లకు సత్కారం
- ట్రాక్టర్లు, వ్యవసాయ పరికరాల పంపిణీ

చింతూరు: సేవాగుణంతో ప్రభుత్వ పథకాలను నేరుగా లబ్ధిదారుల చెంతకు వెళ్లి అందిస్తున్న గ్రామ వలంటీర్ల సేవలు అభినందనీయమని రంపచోడవరం ఎమ్మెల్యే నాగులపల్లి ధనలక్ష్మి అన్నారు. శుక్రవారం స్థానిక మండల పరిషత్ కార్యాలయంలో జరిగిన వలంటీర్ల సత్కార కార్యక్రమంలో ఆమె మాట్లాడారు. కోవిడ్ సమయంలో వారు అందించిన సేవలు మరువ లేనివని ఆమె కొనియాడారు. వీరి సేవలను గుర్తించిన ప్రభుత్వం ప్రోత్సాహకాలు అందిస్తోందన్నారు. చింతూరు మండలంలో ఐదుగురికి సేవారత్న, 147 మందికి సేవామిత్ర పురస్కారాలను ఎమ్మెల్యే ధనలక్ష్మి అందజేశారు.

రైతులకు మేలుచేసే ప్రభుత్వం

ముఖ్యమంత్రి వైఎస్ జగన్ ప్రభుత్వం అన్నదాతకు అండగా నిలుస్తోందని ఎమ్మెల్యే ధనలక్ష్మి అన్నారు. వైఎస్సార్ యంత్రసేవా పథకంలో భాగంగా శుక్రవారం చింతూరు, కూనవరం, వీఆర్‌పురం, ఎటపాక మండలాలకు చెందిన రైతులకు 10 ట్రాక్టర్లు, వ్యవసాయ పరికరాలను చింతూరులో పంపిణీ చేశారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ రైతుల మేలుకోసం రైతుభరోసా కేంద్రాల ఏర్పాటుతో పాటు రైతుభరోసాను ప్రభుత్వం అందిస్తోందన్నారు. గిరిజన రైతాంగానికి లబ్ధి చేకూర్చడంలో భాగంగా నలభై శాతం సబ్సిడీపై ట్రాక్టర్లు ఇవ్వడం జరిగిందని, వీటిని రైతులంతా సద్వినియోగం చేసుకుని సుస్థిర వ్యవసాయం చేయడం ద్వారా ఆర్థికంగా బలోపేతం కావాలని ఆమె ఆకాంక్షించారు.



చింతూరులో వలంటీర్లను సత్కరిస్తున్న రంపచోడవరం ఎమ్మెల్యే ధనలక్ష్మి

తాగునీటి ఎద్దడి లేకుండా చర్యలు

గ్రామాల్లో తాగునీటి ఎద్దడి లేకుండా తగిన చర్యలు చేపట్టాలని ఎమ్మెల్యే ధనలక్ష్మి అధికారులను ఆదేశించారు. శుక్రవారం స్థానిక మండల పరిషత్ కార్యాలయంలో జరిగిన మండల పరిషత్ సర్వసభ్య సమావేశంలో పాల్గొన్న ఎమ్మెల్యే మాట్లాడుతూ జలజీవన్ మిషన్ పనుల పురోగతిని పరిశీలించి అన్ని గ్రామాలకు తాగునీరు అందేలా చూస్తామని అన్నారు. చింతూరు డివిజన్‌లో రహదారులు, విద్యుత్ లైను ఏర్పాటు వంటి విషయాల్లో అటవీ అధికారులు తీవ్ర ఇబ్బందులు పెడుతున్నారని, ఈ పరిస్థితి లేకుండా చూడాలని సూచించారు. సర్వసభ్య సమావేశానికి గైర్హాజరైన అధికారులపై ఎమ్మెల్యే తీవ్ర ఆగ్రహం వ్యక్తం చేశారు. వారిపై చర్యలు తీసుకోవాలని ఆమె ఆదేశించారు. ఎస్టీ కమిషన్ సభ్యుడు చిచ్చడి మురళి, కూనవరం జెడ్పీటీసీ గుజ్జా విజయ, ఎంపీపీలు సవలం అమల, కాక కామేశ్వరి, వైస్ ఎంపీపీలు మేడేపల్లి సుధాకర్, యడమ అర్జున్, కో ఆప్షన్ మెంబర్ అక్బర్‌అలీ, ఎంపీటీసీ సభ్యులు, సర్పంచ్‌లు, వ్యవసాయశాఖ ఏడీ సీహెచ్‌కేవీ చౌదరి, ఎంపీడీవో వెంకటరత్నం, తహసీల్దార్ సుబ్బారావు, ఏవోలు శ్రీనివాసరావు, శ్రీలక్ష్మి, రఘుకుమార్ పాల్గొన్నారు.



ట్రాక్టర్‌ను నడుపుతున్న రంపచోడవరం ఎమ్మెల్యే ధనలక్ష్మి



ఎటపాకలో వలంటీర్లను సత్కరిస్తున్న ఎమ్మెల్యే ధనలక్ష్మి

ఎటపాక: ప్రభుత్వ పథకాలు ప్రజలకు చేరేందుకు వలంటీర్లు చేస్తున్న సేవలు మరువలేవని ఎమ్మెల్యే నాగులపల్లి ధనలక్ష్మి కొనియాడారు. శుక్రవారం మండలంలోని 14 గ్రామసచివాలయాల పరిదిలో పనిచేస్తున్న వలంటీర్లను ఘనంగా సన్మానించారు. మొత్తం 251 మంది వలంటీర్లలో సేవా వజ్రకు ఎంపికైన రాయనపేట గ్రామ సచివాలయ వలంటీర్ బొర్రా వెంకటేష్‌ను సత్కరించి జ్ఞాపిక అందజేశారు. ఐదుగురు వలంటీర్లను సేవా రత్న, 245 మంది వలంటీర్లకు సేవామిత్ర అవార్డులతో సన్మానించారు. జెడ్పీటీసీ ఉబ్బా సుస్మిత,ఎంపీపీ కాక కామేశ్వరి, ఎంపీడీవో విఠల్‌పాల్, తహసీల్దార్ వేణుగోపాల్, సర్పంచ్‌లు, ఎంపీటీసీలు, వైఎస్సార్ సీపీ మండల కన్వీనర్ తానికొండ వాసు పాల్గొన్నారు.

200 యూనిట్ల లోపు వారికే ఉచిత విద్యుత్

- 205 ఆవాసాలకు త్వరలో సదుపాయం
- ఈపీడీసీఎల్ ఎస్‌ఈ మహేంద్రనాథ్

సాక్షి,పాడేరు: జిల్లాలోని 200 లోపు యూనిట్ల విద్యుత్‌ను వినియోగించే అర్హులైన పేద ఎస్సీ,ఎస్టీ వర్గాలకు మాత్రం ప్రభుత్వం ఉచిత విద్యుత్ అమలుచేస్తోందని ఈపీడీసీఎల్ ఎస్‌ఈ ఎల్. మహేంద్రనాథ్ తెలిపారు. శుక్రవారం ఆయన స్థానిక విలేకరులతో మాట్లాడుతూ ఉచిత విద్యుత్ పొందగోరే లబ్ధిదారులు సచివాలయాల్లో జరిగే ఆరు అంచెల వాలిడేషన్ ప్రక్రియలో అర్హులుగా ధ్రువీకరించబడాలన్నారు. తెల్లరేషన్ కార్డు పొంది ఉండాలని, నాలుగు చక్రాల వాహనాలు ఉండకూడదన్నారు. ప్రభుత్వ ఉద్యోగులైన ఎస్సీ,ఎస్టీలకు కూడా ఉచిత విద్యుత్ అమలుకాదన్నారు. ఆదాయపు పన్ను చెల్లించే వారికి ఉచిత విద్యుత్ పథకం వర్తించదన్నారు. చాలామంది ప్రభుత్వ ఉద్యోగులు సంస్థకు బిల్లులు చెల్లించకుండా అక్రమంగా ఉచిత విద్యుత్ పొందుతున్నారని, వారి కనెక్షన్లను తొలగిస్తామని హెచ్చరించారు. సచివాలయాల్లోని సమగ్ర సర్వే ద్వారా జిల్లాలో 1200 మంది విద్యుత్ వినియోగదారులను ఉచిత విద్యుత్ కు అనర్హులుగా గుర్తించామని తెలిపారు. వారి నుంచి రూ.4.2 కోట్ల విద్యుత్ బకాయిలుగా నిర్ధారించి తగు చర్యలు తీసుకుంటున్నామన్నారు. అక్రమార్కుల విద్యుత్ కనెక్షన్ల తొలగింపు సమయంలో విద్యుత్ సిబ్బందిని ఎలాంటి ఇబ్బందులు పెట్టిన వారిపై చట్టరీత్యా చర్యలు తప్పవని ఆయన హెచ్చరించారు. జిల్లాలో 205 గ్రామాల్లో విద్యుత్ సదుపాయానికి చర్యలు తీసుకుంటున్నామని పేర్కొన్నారు.

ప్రతీ అర్జీ పరిష్కరించాల్సిందే

కలెక్టర్ సుమిత్ కుమార్ ఆదేశం

సాక్షి, పాడేరు: స్పందనలో స్వీకరించిన ప్రతీ అర్జీని క్షేత్రస్థాయిలో పరిశీలించి పరిష్కరించాల్సిందేనని కలెక్టర్ సుమిత్‌కుమార్ ఆదేశించారు. శుక్రవారం స్థానిక ఐటీడీఏ సమావేశమందిరంలో నిర్వహించిన స్పందనలో అధికారులను ఉద్దేశించి మాట్లాడారు. ప్రతీ అర్జీ పరిష్కారానికి విచారణాధికారిని నియమించాలని సూచించారు. సమస్య పరిష్కారానికి చేపడుతున్న చర్యలను ఫిర్యాదుదారుడికి తెలియజేయాలని ఆదేశించారు. సమస్య పరిష్కారం కాని పక్షంలో అందుకు కారణాలను అతనికి తెలియజేయాలన్నారు. అన్నిశాఖల అధికారులు సమన్వయంతో పనిచేయాలని, ప్రతీ అధికారి, సిబ్బంది అంతా ఫేసియల్ రికగ్నేషన్ యాప్‌లో హాజరు నమోదు చేసుకోవాలని ఆదేశించారు. వీటి ఆధారంగా జీతభత్యాలు డ్రాచేయాలని, ఇందుకు విరుద్ధంగా వ్యవహరిస్తే చర్యలు తప్పవని హెచ్చరించారు. ఈ కార్యక్రమంలో జాయింట్ కలెక్టర్ శివశ్రీనివాస్, ట్రైనీ కలెక్టర్ శ్రీవాత్సవ, డీఆర్వో అంబేద్కర్, ఎస్‌డీసీ శర్మ తదితరులు పాల్గొన్నారు.

139 వినతుల స్వీకరణ

ఐటీడీఏలో నిర్వహించిన స్పందనలో సుమారు 139 వినతులను స్వీకరించారు.

- జాతీయ రహదారి నిర్మాణంతో తన భూమికి సంబంధించి నష్ట పరిహారం చెల్లించాలని అరకులోయ మండలం కొత్తభల్లుగుడ పంచాయతీ గద్యగూడకు చెందిన దూరియా రాంచందర్ విన్నవించాడు.
- కొయ్యూరు మండలం రత్నంపేట గ్రామానికి చెందిన సీఆర్పీగా పనిచేసిన తన భర్త రాజబాబు అనారోగ్యంతో మృతిచెందారని, తనకు ఏదైనా పాఠశాలలో ఉపాధి,ఉద్యోగ అవకాశాలు కల్పించాలని అతని భార్య ఎర్రమ్మ విన్నవించుకున్నారు.
- విద్యుత్ సౌకర్యం కల్పించాలని కొయ్యూరు మండలం నల్లగొండ పంచాయతీ కొత్తభోయ గిరిజనులు కలెక్టర్‌ను కోరారు.
- తాగునీటి సమస్య పరిష్కరించాలని,అన్ని వీధుల్లో కుళాయిల ద్వారా సురక్షిత నీరు అందించాలని పాడేరు పట్టణానికి చెందిన కె.మధు కోరారు.
- ఇల్లు మంజూరు చేయాలని హుకుంపేట మండలం రంగశీల పంచాయతీ ఒంటిపాక గ్రామానికి చెందిన గంజాయి మల్లేశ్వరరావు అధికారులను కోరాడు.
- ఇదేలగొంది నుంచి అర్లాడ వరకు రోడ్డు నిర్మాణం చేపట్టాలని, పాఠశాల మంజూరు చేయాలని,అంగన్‌వాడీ కేంద్రానికి సొంత భవనం మంజూరు చేయాలని హుకుంపేట మండలం శోభకోట పంచాయతీ ఇదేలగొంది గ్రామస్తులు కలెక్టర్‌కు విన్నవించారు.



గిరిజనుల నుంచి వినతులు స్వీకరిస్తున్న కలెక్టర్ సుమిత్‌కుమార్, ఐటీడీఏ పీవో అభిషేక్

క్లుప్తంగా

వంద కిలోల గంజాయి పట్టివేత

● నలుగురు అరెస్టు, ఇద్దరు పరారీ

మారేడుమిల్లి : ఆంధ్ర, ఒడిశా సరిహద్దు అటవీ ప్రాంతం నుంచి మహరాష్ట్రకు అక్రమంగా తరలిస్తున్న వంద కిలోల గంజాయిని మారేడుమిల్లి పోలీసులు శుక్రవారం పట్టుకున్నారు. ఎస్ఐ రాము తెలిపిన వివరాల ప్రకారం మహారాష్ట్రకు చెందిన అకింత్ కేతన్ సవ్లా, అభిజిత్ గోవింత్ రాఖ్, రుషికేష్ బాపురావ్, సాగర్ కొల్లి అనే వ్యక్తులు రెండు కార్లలో గంజాయితో వస్తుండగా అనుమానం వచ్చిన పోలీసులు కూడురు గ్రామ శివారులో తనిఖీ చేయగా గంజాయి పట్టుబడింది. వారి నుంచి 25 కిలోల చొప్పున నాలుగు బ్యాగ్‌లలోని వంద కిలోల గంజాయిని స్వాధీనం చేస్తుకుని, నిందితులను అరెస్ట్ చేశారు. మరో ఇద్దరు నిందితులు మల్లికార్జున్, మదన్ పరారీలో ఉన్నట్టు ఎస్ఐ తెలిపారు. గంజాయి విలువ రూ.మూడు లక్షలు ఉంటుందన్నారు. రెండు కార్లు, నాలుగు సెల్ ఫోన్లలను సీజ్ చేశామని, కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నామని ఎస్ఐ తెలిపారు.

సమస్యల పరిష్కారానికి వినతి

అరకులోయ రూరల్: సమస్యలు పరిష్కరించాలని కోరుతూ గ్రామ సచివాలయం వెటర్నరీ అసిస్టెంట్లు శుక్రవారం ఎస్టీ కమిషన్ చైర్మన్ కుంభా రవిబాబుకు వినతిపత్రం అందజేశారు. క్లస్టర్ విధానంతో రైతు భరోసా కేంద్రాల విలీనమయ్యే పరిస్థితి ఉందని, దీంతో తమకు భవిష్యత్తులో ఇబ్బందులు పడాల్సి వస్తోందని వినతిలో పేర్కొన్నారు. దీనిపై స్పందించిన రవిబాబు మాట్లాడుతూ సమస్యను యంత్రాంగం దృష్టికి తీసుకెళ్లి పరిష్కారానికి కృషి చేస్తామన్నారు. స్వామి, త్రినాథ్, సంజీవ్, అప్పారావు, ఆనంద్, రత్నం, రవి పాల్గొన్నారు.

పేకాటరాయుళ్ల అరెస్టు

రావికమతం: మేడివాడ గ్రామంలో పేకాట శిబిరంపై శుక్రవారం దాడిచేసి అయిదుగురు వ్యక్తులను అరెస్ట్ చేశామని రావికమతం ఎస్ఐ ఉమామహేశ్వరరావు శుక్రవారం తెలిపారు. మేడివాడ శివార్లులోని తోటల్లో పెద్ద ఎత్తున పేకాట ఆడుతున్నట్టు ముందస్తు సమాచారం అందడంతో సిబ్బందితో దాడి చేశామన్నారు. పలువురు పరారీకాగా అయిదుగురు వ్యక్తులు పట్టుబడ్డారన్నారు. వీరి నుంచి రూ.1,230 నగదు స్వాధీనం చేసుకున్నామన్నారు.



▪ 'బాగున్నారా.. ప్రభుత్వం ఏర్పాటు చేసిన కిల్కారీ మొబైల్ సేవ నుంచి డాక్టర్ అనితను మాట్లాడుతున్నాను. బిడ్డ ఆరోగ్య సంరక్షణలో మీరు ఆచరించేందుకు సులువుగా ఉండే విషయాలు చెబుతా.. మనమంతా కలిసి మీ బిడ్డకు మెరుగైన భవిష్యత్తు అందిద్దాం'అంటూ గర్భిణులకు నాలుగో నెలలో వాయిస్ మెసేజ్ వస్తుంది.

▪ బిడ్డ పుట్టిన తర్వాత 'నమస్కారం.. మీకు తెలుసా.. పుట్టిన గంటలోగా బిడ్డకు పాలు తాగించాలి. తల్లిపాలే బిడ్డకు సంపూర్ణ ఆహారం. బిడ్డకు కావాల్సినవన్నీ వాటిలోనే ఉంటాయి'అని చెబుతూ గర్భిణులు, బాలింతల్లో అవగాహన పెంచుతున్నారు.

కిల్కారీ.. మహా ఉపకారి

- గర్భిణులు, బాలింతలకు కిల్కారీ ఫోన్‌కాల్స్
- మాత శిశు మరణాల నియంత్రణకు చర్యలు
- వారంలో 19 వేలమంది ఫోన్లకు వాయిస్ కాల్స్

సాక్షి, అనకాపల్లి : మాతా శిశు మరణాల నియంత్రణే లక్ష్యంగా కుటుంబ సంక్షేమ శాఖ ఆధ్వర్యంలో వినూత్న కార్యక్రమానికి కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు శ్రీకారం చుట్టాయి. గర్భిణులు, బాలింతలు, శిశువుల ఆరోగ్యంపై ప్రభుత్వం ప్రత్యేక దృష్టి సారించింది. ఆహార నియమాలు, వైద్య పరీక్షలు తదితర అంశాలపై అప్రమత్తం చేసేందుకు «కిల్కారీ» పేరిట వాయిస్ కాల్స్ అందించేందుకు వైద్య, ఆరోగ్య శాఖ రూపకల్పన చేసింది. అనకాపల్లి జిల్లాలో మొత్తం 19,963 మంది గర్భిణులు ఉంటే.. వారిలో కనీసం 19 వేల మందికి కిల్కారీ సందేశాలు అందించడమే లక్ష్యంగా పనిచేస్తున్నారు.

మార్చి నుంచి సేవలు

రాష్ట్రంలో ఈ ఏడాది మార్చి నుంచి కిల్కారీ సేవలు ప్రారంభం అయ్యాయి. ఇప్పటికే జిల్లాలో పీహెచ్‌సీల మెడికల్ ఆఫీసర్లు, ఏఎన్ఎంలు, ఆశా కార్యకర్తలకు కూడా శిక్షణ కల్పించారు. వీరి ద్వారా గర్భిణులకు, బాలింతలకు అవగాహన కల్పిస్తున్నారు. ప్రతీ వారం గర్భిణులు తీసుకోవాల్సిన జాగ్రత్తలపై వారి మొబైళ్లకు వాయిస్‌కాల్ వస్తుంది. నాలుగు నెలలు నిండిన గర్భిణుల నుంచి బాలింతల వరకూ ప్రతీ ఒక్కరి మొబైల్‌కి వాయిస్ కాల్ వస్తుంది. మహిళ గర్భం దాల్చినప్పటి నుంచి బిడ్డకు ఏడాది వయస్సు వచ్చే వరకు 72 సార్లు వాయిస్ కాల్స్, మొబైల్ సందేశాలు వచ్చేలా కిల్కారీ కార్యక్రమానికి రూపకల్పన చేశారు.



శిక్షణ కార్యక్రమంలో ఆరోగ్య సిబ్బంది (ఫైల్)

టోల్‌ఫ్రీ వాయిస్‌కాల్

సచివాలయ పరిధిలో గల ఏఎన్ఎం ఎప్పుడైతే రిజిష్టర్‌లో గర్భిణి వివరాలను నమోదు చేస్తారో.. తక్షణమే కిల్కారి సేవల్లో కూడా రిజిష్టర్ అయినట్టే. మూడో నెల గర్భవతిగా ఉన్నప్పటి నుంచే ఈ సేవలు ప్రారంభమవుతాయి. గర్భిణుల్లో తలెత్తే పలు సందేహాలను నివృత్తి చేసేలా ఈ వాయిస్ కాల్ సందేశం ఉంటుంది. గర్భిణులు, పాలిచ్చే తల్లుల మొబైళ్లకు డాక్టర్ అనిత అనే కల్పిత వైద్యురాలి వాయిస్‌తో ఆరోగ్యపరమైన సూచనలు, తీసుకోవాల్సిన పోషకాహారం, చేయించాల్సిన వైద్య పరీక్షలు వంటి అంశాలను వివరిస్తారు. ఈ వాయిస్ కాల్ సుమారు ఒకటిన్నర నిమిషం ఉంటుంది. గర్భిణులు ఫోన్ లిఫ్ట్ చేయకపోతే ఐవీఆర్ఎస్ విధానంలో ఆటోమెటిక్‌గా ఒకే రోజు మూడు సార్లు ఫోన్‌కాల్స్ వచ్చేలా చేస్తుంది. ఆ సందేశాలను మరోసారి వినాలనుకుంటే 14423 టోల్ ఫ్రీ నెంబరుకు డయల్ చేస్తే చాలు.



కిల్కారీ అవగాహన పోస్టర్

దశలవారీగా శిక్షణ

జిల్లాలో కిల్కారీ సేవలకు సంబంధించి అన్ని ప్రాథమిక ఆరోగ్య కేంద్రా(పీహెచ్‌సీ)ల పరిధిలో మెడికల్ ఆఫీసర్, సచివాలయ ఏఎన్ఎంల ద్వారా ఆశ కార్యకర్తలు, అంగన్‌వాడీ కార్యకర్తలకు కూడా అవగాహన కల్పిస్తున్నారు. జిల్లాలో దశల వారీగా శిక్షణ కల్పించారు. ప్రతీ నెల మొదటివారంలో ఒక రోజు ఆశ కార్యకర్తలకు ఈ సేవలపై అవగాహన కల్పిస్తున్నారు. ప్రతి అంగన్‌వాడీ సెంటర్‌లో వైఎస్సార్ సంపూర్ణ పోషణ, వైఎస్సార్ సంపూర్ణ పోషణ ప్లస్ కార్యక్రమాల్లో భాగంగా ఏర్పాటు చేసిన పౌష్టికాహారం, వాటి ద్వారా అందే పోషక విలువలపై అంగన్‌వాడీ కార్యకర్తల ద్వారా గర్భిణులకు వీడియో రూపంలో అవగాహన కల్పిస్తున్నారు. తల్లీ బిడ్డ ఆరోగ్యంపై తీసుకోవాల్సిన జాగ్రత్తలు, కిల్కారీ వాయిస్ కాల్స్ తప్పక వినడం ద్వారా కలిగే ప్రయోజనాలను తెలిపేలా చర్యలు తీసుకుంటున్నారు.

మాతా శిశు మరణాలు తగ్గించేందుకే...



గర్భం దాల్చిన నుంచి పిల్లలు నడిచే వరకు గర్భిణులు, తల్లులు నిరంతరం బిజీ. వారి ఆరోగ్యంపై శ్రద్ధ తగ్గుతుంది. అలాంటి వారి ఆరోగ్య పరిరక్షణకు కిల్కారీ దోహపడతుంది. ఈ సేవల ద్వారా గ్రామాల్లో ఉండే ప్రతీ ఒక్కరిలో ఆరోగ్యంపై అవగాహన కల్పిస్తున్నాం. వారంతట వారే పౌష్టికాహారం తీసుకుంటూ ఆరోగ్యాన్ని సంరక్షించుకునేలా చర్యలు తీసుకుంటున్నాం. మాతా శిశు మరణాలను పూర్తి స్థాయిలో తగ్గించేందుకే ప్రభుత్వం ఈ సేవలను తీసుకొచ్చింది. గర్భిణులు తమ సందేహాలను కూడా నివృత్తి చేసుకోవచ్చు.

– డాక్టర్ రేవతి, డీసీఎం

ఇంటి వద్దనే అవగాహన



అంగన్‌వాడీ కేంద్రాల్లో గర్భిణులకు, బాలింతలకు అవగాహన కల్పిస్తున్నాం. ప్రతీ నెలా మొదటి వారంలో ఓ రోజు కిల్కారీ సేవలపై ఎలా కాల్ చేయాలి? వాయిస్ కాల్స్ ఎలా వస్తాయి? అనే వాటిపై శిక్షణ ఇస్తున్నాం. అంగన్‌వాడీ కేంద్రాలకు రాని, రాలేని గర్భిణులకు, బాలింతలకు నేరుగా వారి ఇంటికే వెళ్లి ఆశా కార్యకర్త, అంగన్‌వాడీ కార్యకర్తల సహకారంతో అవగాహన కల్పిస్తున్నాం.

– ఎ.లక్ష్మి, ఏఎన్ఎం, గన్నవరం సచివాలయం, నాతవరం

మంత్రులకు సాదర స్వాగతం



మంత్రి విడదల రజనికి స్వాగతం పలుతున్న డిప్యూటీ మేయర్ జియ్యాని శ్రీధర్

గోపాలపట్నం : రాష్ట్ర రెవెన్యూ శాఖా మంత్రి ధర్మాన ప్రసాదరావు, ఆరోగ్య శాఖా మంత్రి విడదల రజనిలకు విశాఖ విమానాశ్రయంలో సాదర స్వాగతం లభించింది. వీరిని విమానాశ్రయంలో డిప్యూటీ మేయర్ జియ్యాని శ్రీధర్ మర్యాదపూర్వకంగా కలిశారు.

నేడు వందేభారత్ రీషెడ్యూల్

తాటిచెట్లపాలెం(విశాఖ ఉత్తర): విశాఖ–సికింద్రాబాద్ (20833) వందేభారత్ ఎక్స్‌ప్రెస్ శనివారం నాలుగు గంటలు ఆలస్యంగా బయల్దేరుతుంది. పలు నిర్వహణ పనుల నిమిత్తం శనివారం బయల్దేరవలసిన వందేభారత్‌ను రీషెడ్యూల్ చేస్తున్నట్లు వాల్తేర్ డివిజన్ అధికారులు తెలిపారు. ఉదయం 5.45గంటలకు బయల్దేరవలసిన విశాఖపట్నం–సికింద్రాబాద్ (20833) వందేభారత్ ఉదయం 9.45గంటలకు విశాఖపట్నంలో బయల్దేరుతుందని అధికారులు తెలిపారు.

సల సల!



- సెగలు కక్కుతున్న భానుడు
- ఉడుకుతున్న ఉమ్మడి విశాఖ
- అనకాపల్లి 44.2.. వైజాగ్ : 42 డిగ్రీలు
- మరో మూడు రోజులు కొన సాగనున్న వడగాడ్పులు

సాక్షి, విశాఖపట్నం: రోహిణి కార్తె వెళ్లిపోయినా భానుడు శాంతించడం లేదు. రోహిణి కార్తెలో రోళ్లు పగిలే ఎండలు కాస్తాయన్న సామెత ఈ వేసవిలో మరోసారి రుజువైంది. గత నెల 25 నుంచి రోహిణి కార్తె ప్రతాపం మొదలై గురువారంతో ముగిసింది. ఆ తర్వాత మృగశిర కార్తె ప్రవేశించాక చిరుజల్లులు, వర్షాలతో చల్లదనం పరచుకుంటుంది. కానీ ఇప్పటికీ రోహిణి తీవ్రతే కొనసాగుతోంది. అదుపు తప్పుతున్న ఉష్ణోగ్రతలతో ఉమ్మడి విశాఖ జిల్లా అట్టుడికిపోతోంది. కొద్ది రోజులుగా ఇదే పరిస్థితి నెలకొంది. తెల్లారగానే మొదలవుతున్న సెగలు సాయంత్రం ఆరేడు గంటలవుతున్నా ఆరడం లేదు. ఇళ్లలో ఫ్యాన్లు గిరగిరా తిరుగుతున్నా తాపం తగ్గడం లేదు. ఏసీలు, కూలర్లు రేయింబవళ్లు ఆగకుండా అలా ఆన్‌లోనే ఉంటున్నాయి. బయట నుంచి వచ్చే వేడిగాలులు, వడగాడ్పులు భయకంపితులను చేస్తూనే ఉన్నాయి. శుక్రవారం ఉమ్మడి విశాఖ జిల్లాలో తారెత్తించే ఉష్ణోగ్రతలు నమోదయ్యాయి. అత్యధికంగా అనకాపల్లిలో 44.2, అల్లూరి సీతారామరాజు జిల్లా నువ్వులమామిడిలో 44.09, విశాఖ నగరంలో 42 డిగ్రీల ఉష్ణోగ్రతలు రికార్డయ్యాయి. ఇలా ఈ మూడు జిల్లాల్లో పలుచోట్ల 42 నుంచి 44 డిగ్రీలకు పైగా గరిష్ట ఉష్ణోగ్రతలు నమోదై జనాన్ని బెంబేలెత్తించాయి. ఇవి సాధారణంకంటే 4 నుంచి 7 డిగ్రీలు అధికమన్న మాట! మరోవైపు రానున్న మూడు రోజులు ఉమ్మడి విశాఖ జిల్లాలో ఇదే పరిస్థితి కొనసాగే అవకాశం ఉందని ఐఎండీ అంచనా వేసింది.

తారెత్తిస్తున్న ఎండలు

సాక్షి, పాడేరు: ఏజెన్సీలో ఎండలు మండి పోతున్నాయి. శుక్రవారం ఉదయం 8 గంటల నుంచే భానుడు విజృంభించాడు. పాడేరుతో పాటు అరకు వారపు సంతలో ఎండతో వ్యాపారులు, గిరిజనులు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొన్నారు. సాయంత్రం వరకు ఎండ తీవ్రతతో ప్రజలు అవస్థలు పడ్డారు. అలాగే చింతూరు, రంపచోడవరం డివిజన్ పరిధిలో కూడా అధిక ఉష్ణోగ్రతలు నమోదయ్యాయి. జిల్లా కేంద్రం పాడేరులో 38 డిగ్రీల గరిష్ట ఉష్ణోగ్రత నమోదైంది.

రాజవొమ్మంగి: మండలవ్యాప్తంగా శుక్రవారం ఎండ తారెత్తించింది. ప్రజలు మండుటెండకు నానా అవస్థలు పడ్డారు. ఉదయం 11 గంటల నుంచి రహదారులన్నీ నిర్మానుష్యంగా మారాయి. గ్రామస్తులు ఇళ్లకే పరిమితమయ్యారు. వడగాల్పులు, ఉక్కపోతతో చిన్నారులు, వృద్ధులు అల్లాడిపోయారు. మూగజీవాలు చెట్ల నీడన సేదతీరాయి. శీతల పానీయాలకు డిమాండ్ నెలకొంది. ఈ ప్రాంతంలో ఎన్నడూ లేనంతగా ఈ ఏడాది ఎండలు విజృంభిస్తున్నాయని పలువురు పెద్దలు చెబుతున్నారు.

శుక్రవారం ఉమ్మడి విశాఖలో ఉష్ణోగ్రతలు (డిగ్రీల్లో)

జిల్లా	ప్రాంతం	ఉష్ణోగ్రత
అనకాపల్లి	అనకాపల్లి	44.20
ఏఎస్సార్	నువ్వుమామిడి	44.09
అనకాపల్లి	మునగపాక	44.01
ఏఎస్సార్	రాయనపేట	43.59
ఏఎస్సార్	కొత్తూరు	43.40
ఎఎస్సార్	బుట్టాయగూడెం	43.39
అనకాపల్లి	కొత్తకోట	43.18
అనకాపల్లి	మాడుగుల	43.02
విశాఖపట్నం	గంభీరం	42.66
విశాఖపట్నం	భీమిలి	42.30
విశాఖపట్నం	పద్మనాభం	42.20
విశాఖపట్నం	ఎయిర్‌పోర్టు	42.00
విశాఖపట్నం	సింహాచలం	42.00
విశాఖపట్నం	అక్కిరెడ్డిపాలెం	41.40
విశాఖపట్నం	ములగాడ	41.10
విశాఖపట్నం	డైరీఫారం	41.00

'రోప్ స్కిప్పింగ్'లో మెరిసిన మేరీ

మురళీనగర్: జాతీయ స్థాయి రోప్ స్కిప్పింగ్ చాంపియన్‌షిప్ పోటీల్లో కంచరపాలెం ప్రభుత్వ పాలిటెక్నిక్ కాలేజీ విద్యార్థి సత్తా చాటి పతకాలు సాధించింది. ఈ నెల 3 నుంచి 5వ తేదీ వరకు ముంబయిలో జరిగిన జాతీయ రోప్ స్కిప్పింగ్ చాంపియన్‌షిప్‌లో మెటలర్జికల్ ఇంజినీరింగ్ మూడో సంవత్సరం చదువుతున్న విద్యార్థిని ఎస్.మేరీ ఈ ఘనత సాధించింది. 17 ఏళ్లలోపు బాలికల 'డబుల్ అండర్ 30 సెకండ్స్' విభాగంలో బంగారు పతకం, 'స్పీడ్ స్ప్రింట్ 30 సెకండ్స్' విభాగంలో వెండి పతకం సాధించింది. పాలిటెక్నిక్ కాలేజీలో శుక్రవారం ఏర్పాటు చేసిన సమావేశంలో ఇన్‌చార్జి ప్రిన్సిపాల్ కేడీవీ నరసింహారావు, మెటలర్జీ విభాగం హెడ్ డాక్టర్ రత్నకుమార్, జనరల్ విభాగం హెడ్ డాక్టర్ పీఎం భాషా, ఫిజికల్ డైరెక్టర్ అబ్బాస్ బేగ్ ఆమెను అభినందించారు.

అనుమానాస్పద స్థితిలో వ్యక్తి మృతి

- కొత్త యర్రవరంలో ఘటన
- ఘటన స్థలాన్ని పరిశీలించిన సీఐ గఫూర్, ఎస్ఐ పాపినాయుడు

యలమంచిలి : మున్సిపాలిటీ పరిధి కొత్త యర్రవరం గ్రామానికి చెందిన ఒక వ్యక్తి అనుమానాస్పద స్థితిలో మృతి చెందినట్టు పట్టణ ఎస్ఐ కె.పాపినాయుడు శుక్రవారం సాయంత్రం తెలిపారు. ఆయన తెలిపిన వివరాలివి. కొత్త యర్రవరం గ్రామానికి చెందిన సేనాపతి కామరాజు గురువారం ఉదయం ఇంటి నుంచి బయటకు వెళ్లాడు. అయితే తిరిగి ఇంటికి చేరుకోలేదు. శుక్రవారం సాయంత్రం గ్రామ సమీపంలో అనుమానాస్పద స్థితిలో మృతి చెందాడు. దీనిపై సమాచారం అందడంతో సీఐ గఫూర్, ఎస్ఐ పాపినాయుడు ఘటనా స్థలాన్ని పరిశీలించారు. మృతుడికి భార్య, ఇద్దరు పిల్లలు ఉన్నారు. మృతుడు భార్య రోజా ఇచ్చిన ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేశామని, పోస్టుమార్టం నివేదిక ఆధారంగా దర్యాప్తు చేస్తామని ఎస్ఐ పాపినాయుడు తెలిపారు.



మృతదేహాన్ని పరిశీలిస్తున్న సీఐ షేక్ గఫూర్, ఎస్ఐ పాపినాయుడు

ఆటోలో తోట

- ఆకట్టుకుంటున్న గ్రీన్ ఆటో
- ఆటో చుట్టూ పర్యావరణాన్ని కాంక్షిస్తూ మొక్కలు
- ఆటో లోపల గ్రీన్ గార్డెన్

దాబాగార్డెన్స్ : ఇంటి పెరట్లోను.. మిద్దెలపైన మొక్కలు పెంచటం సహజం. అందుకు భిన్నంగా తన బతుకు బండి అయిన ఆటోను హరితవనంగా మార్చాడు. ఆటోలో ఎక్కే ప్రయాణికులకు ఇది ఎంతో ఆహ్లాదాన్ని కలిగిస్తుంది. నగరంలో పర్యావరణ ఆటో విశేషంగా ఆకట్టుకుంటోంది. ప్రయాణికులెవరైనా సరే ఫొటోలు తీసుకుంటారు. సెల్ఫీలతో సందడి చేస్తారు. ఆ తర్వాత ఆటో ఎక్కి..ప్రయాణిస్తారు.



గ్రీన్ (పర్యావరణ)ఆటో..



ఆటో లోపల గ్రీనరీ..

ఆటో కార్మికుడు డేవిడ్

వివరాల్లోకి వెళ్తే..గాజువాక గణపతినగర్‌కు చెందిన ఎం.డేవిడ్ ఏడేళ్లుగా ఆటో నడుపుతున్నాడు. తన ఆటోను స్కూల్ పిల్లల కోసం అధునాతనంగా అలంకరించుకున్నాడు. వివిధ పాఠశాలల పిల్లలను తరచూ తీసుకెళ్తుంటాడు. ఎప్పుడైనా పాఠశాలలకు సెలవైతే..ఆ ఆటోను ప్రజల కోసం అందుబాటులోకి తెస్తుంటాడు. సాధారణ ఆటో చార్జీలే వసూలు చేస్తుంటాడు. ఆటోలో ముఖ్యంగా పచ్చదనం కనిపిస్తోంది. ఆటో చుట్టూ పూల మొక్కలు ఏర్పాటు చేశాడు. సీటు.. సీలింగ్‌తో పాటు మొత్తం ఆటో అంతా పచ్చదనంతోనే నింపాడు. ఆ ఆటోలో ప్రయాణిస్తుంటే..ఏసీలో ప్రయాణించినట్టు ఉంటుందని ప్రయాణికులు చెబుతున్నారు.

పర్యావరణ పరిరక్షణకే.. : నగరంలో కాలుష్యం పెరిగిపోతోంది. దీంతో వినూత్నంగా ఆటోను తీర్చిదిద్దాలనుకున్నా..పైగా పాఠశాలలకు పిల్లలను తీసుకువెళుతుంటా..ఈ క్రమంలో ఆటోను పర్యావరణహితంగా మార్చాలని భావించా..అందుకనుగుణంగా పచ్చదనంతో నింపేశా..ఆటోలో ప్రయాణిస్తున్నప్పుడు స్వచ్ఛమైన గాలితోపాటు ఆహ్లాదకరంగా ఉంటుంది. ఆటో పైటాప్‌పై కూడా గార్డెన్ వేయనున్నట్టు తెలిపాడు.